క్లుప్తంగా

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి మిగిలిన సీట్లను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్సీ కేటగిరిలో మాత్రమే సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థినీలు శుక్రవారం సాయంత్రంలోపు గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్ష ఉంటుందన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



చెక్కును అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

బేతంచెర్ల: యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు డిప్యూటీ రీజనల్ మేనేజర్ సురేంద్రగౌడు, ఇన్సూరెన్స్ మేనేజర్ లింగేశ్వర్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన శ్రీనివాసులు గతేడాది అక్టోబర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. హౌసింగ్‌లోన్ తీసుకున్న మృతుడు క్రెడిట్ లైఫ్ బీమా సభ్యుడు కావడంతో ఆయన కుటుంబానికి రూ. 60 లక్షలు మంజూరైంది. మేనేజర్ వినోద్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ స్వామితో కలిసి వారు గురువారం బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

బెదిరింపుల కేసు నమోదు

బనగానపల్లెరూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన మేకల పెద్ద సంజీవయ్య మొదటి భార్య కుమారులు వెంకటేష్, సంజీవ్‌పై బెదిరింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి గురువారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు మేకల పెద్ద సంజీవయ్య బతికి ఉండగానే రెండవ భార్య లక్ష్మీ నరసమ్మకు గ్రామపెద్దల సమక్షంలో 3.40 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ఇల్లు ఇచ్చారు. అయితే లక్ష్మీనరసమ్మ పొలంలో వెంకటేష్, సంజీవ్ ప్రవేశించి గట్టును చేరిపేశారు. ఎందుకిలా చేవారని వారిని ప్రశ్నించిన తనను దూర్భాషలాడి, చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని లక్ష్మీ నరసమ్మ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రికెట్ బ్యాట్ల పంపిణీ



క్రీడాకారులకు బ్యాట్లు అందజేస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం వద్ద గురువారం క్రికెట్ క్రీడాకారులకు కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తనయుడు కాటసాని ఓబులరెడ్డి బ్యాట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడలపై మరింత ఆసక్తిని పెంచుకోవాలన్నారు. క్రీడాకారుల్లోని ప్రతిభ ను వెలికితీయాలన్న లక్ష్యంతోనే తాము కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ యువనాయ కులు అత్తార్ అఖిల్‌హుస్సేన్, మోహన్‌రెడ్డి, కాటసాని ఓబులరెడ్డి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ వర్ధంతి

డోన్ టౌన్ : పట్టణంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాల్లో హెచ్‌ఎం తొగట సురేష్ బాబు ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ సేవలను వారు హెచ్‌ఎం గుర్తు చేశారు.

వృద్ధాశ్రమ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్ : పట్టణంలోని వైయస్ నగర్‌లో ఉన్న హోసన్నా వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న జాన్ ప్రభాకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, పట్టణ కార్యదర్శి నారాయణ, మహిళా సమైఖ్య మండల కార్యదర్శి లక్ష్మీదేవమ్మ డిమాండ్‌చేశారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆనాథ ఆశ్రమం నిర్వహిస్తూ ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులను, ఆశ్రమయంలోని వృద్ధులకు వచ్చే పింఛన్లను స్వాహా చేస్తున్నారని, మహిళలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

ఆరుగురిపై కేసు నమోదు

కోవెలకుంట్ల: వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చినా అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలు గురువారం పోలీసులను ఆశ్రయించింది. కోవెలకుంట్ల ఎస్‌ఐ మౌలానీ సమాచారం మేరకు.. పట్టణానికి చెందిన కల్యాణి మండలంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారిణిగా పనిచేస్తోంది. రెండు సంవత్సరాల క్రితం వైఎస్సార్ జిల్లా గోపాయిపల్లెకు చెందిన బ్రహ్మంతో వివాహం జరిగింది. వీరికి ఆరు నెలల కుమార్తె. కొంత కాలం నుంచి అదనపు కట్నం తేవాలని భర్త, అత్తమామలు, ఉసేనమ్మ, చిన్నదస్తగిరి ఆడపడచులు రమీజా, షబరీ, ఆడపడచు భర్త లక్ష్మణ్ వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో పుట్టింటికి చేరుకున్న కల్యాణి పోలీస్ స్టేషన్ ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఈమె పేరు రామలక్షుమ్మ. కొలిమిగుండ్ల మండలం, అంకిరెడ్డి పల్లెలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఉన్న కుమారుడి పక్షవాతంతో ఇంటికే పరిమితయ్యాడు. కోడలు ఇటీవలనే మృతి చెందింది. వీరి ముగ్గురు సంతానికి ఈమే దిక్కు. ఏ విషయానికైనా ఈమె బయటకు వెళ్లాల్సి ఉంది. వలంటీర్లు ఈమె ఇంటికి వచ్చి కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరమని నమోదు చేసుకున్నారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలు అందడంతో సంతోషం వ్యక్తం చేస్తుంది రామలక్షుమ్మ. కుటుంబ పరిస్థితుల మూలంగా కూలీ పనులు మానుకోలేని పరిస్థితుల్లో ఉచితంగా సర్టిఫికెట్లు అందడంతో ఇబ్బందులు తప్పాయని ఆనందం వ్యక్తం చేసిందామె.



ధ్రువీకరణ పత్రం చూపుతున్న విద్యార్థిని గుర్రాల నాగజ్యోతిది సంజామల మండలం, నొస్సం గ్రామం. కడప జిల్లా జమ్మలమడుగులో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతుంది. మండల కేంద్రానికి దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నొస్సం నుంచి ధ్రువీకరణ పత్రాలకు సంజామలకు రావాల్సి ఉంది. గతంలో సర్టిఫికెట్ల కోసం పడరాని పాట్లు పడిన ఈ విద్యార్థినికి గంటల్లో అన్ని సర్టిఫికెట్లు అందజేశారు అధికారులు. ఇదే సర్టిఫికెట్ల కోసం తాను గతంలో రెండు, మూడు రోజులు తిరిగానని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జగనన్న సురక్ష ద్వారా పైసా ఖర్చు కాకుండా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందానని సంతోషం వ్యక్తం చేసింది నాగజ్యోతి.



ప్రతి పేదకూ పథకాలే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి
- జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి



మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: అర్హత కలిగిన ప్రతి పేదకు సంక్షేమ పథకాలు అందజేసి న్యాయం చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. సాంకేతిక, ఇతర కారణాల మూలంగా ప్రభుత్వ పథకాలు అందని పేదలను గుర్తించి అందజేయడంతోపాటు ప్రజల వద్దకే పాలన భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను నేరుగా అందజేస్తున్నామని చెప్పారు. మండలంలోని అంకిరెడ్డిపల్లె సచివాలయం–2 పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ హాజరయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి 372 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను జెడ్పీ చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా సర్టిఫికెట్లు అందేవి కావని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గంటల వ్యవధిలోనే ఇంటికే సర్టిఫికెట్లు తీసుకొచ్చి అందజేస్తున్న రోజులు వచ్చాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ సొమ్ము తీసుకోవాలంటే పడిన అగచాట్లు అందరికీ తెలుసుని, ఇలాంటి సమస్యలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వస్తి పలుకుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి నెలా ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో పింఛన్‌దారులకు ఇంటి వద్దనే అందజేస్తుందని గుర్తు చేశారు. అర్హత ఉండి మిగిలి పోయిన లబ్ధిదారులకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశంతో ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న పలు సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, పలు రాష్ట్రాలు అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులు అధ్యాయనం చేస్తున్నారని చెప్పారు. అంకిరెడ్డిపల్లెలో రూ.2కోట్లతో అతి త్వరలోనే పీహెచ్‌సీ నిర్మాణానికి భూమి పూజ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగన్న, మండల ఉపాధ్యక్షుడు దస్తగిరి, తహసీల్దార్ దోసీ ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు లాయర్ మహేశ్వర రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు రామ సుబ్బయ్య, నాయకులు కొప్పుల భాస్కర్‌రెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం ఎంపీడీఓ రాధిక, తహసీల్దార్ పుష్పకుమారి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలోని పెద్దకొప్పెర్ల, వల్లంపాడు, చిన్నకొప్పెర్ల, ఎం. గోవిందిన్నె గ్రామాల్లో అర్హతలు ఉండి సంక్షేమ పథకాలు వర్తించని పేదల వివరాలను పరిశీలించారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురికి కుల, ఆదాయ, పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, వన్‌బీ అడంగళ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయలక్ష్మి, ఓబుళపతిరెడ్డి, డీవీ శేషిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మోహన్ రెడ్డి, ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, ఏపీఓ శ్రీవిద్య పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

అవుకు: మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మీల ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు చల్లా ప్రభాకర్ రెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లాచైతన్యరెడ్డి,గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో గురువారం ఎంపీడీవో నాగ కుమార్, తహసీల్దార్ మల్లికార్జున జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హత ఉండి ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు వర్తించని పేదల వివరాలను పరిశీలించిన ఎంపీడీఓ, తహసీల్దార్ నెలలోపు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ పెద్ద కంబయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మలికిరెడ్డి రఘురామిరెడ్డి, మలికిరెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులతో కలిసి ప్రజలకు వివధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి,ఉపాధి హామీ ఏపీఓ ప్రకాష్ రావు, ఏపీఎం శేఖర్, ఈఓఆర్‌డీ పాపరాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బేతంచెర్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు ముర్తుజావలీ, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 1, 2 వ సచివాలయాల పరిధిలోని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, డీటీ సత్యదీప్ జగనన్న సురక్ష కార్యమాన్ని నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగావారు సూచించారు. 1వ సచివాలయం పరిధిలో 639 మంది, 2వ సచివాలయం పరిధిలో 648 మందికి ఇన్‌కం, క్యాస్ట్, రేషన్ కార్డులతో పాటు 8 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్స్ షేక్ ముబీనా, చింతల నాగిరెడ్డి, మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, దస్తగిరి, సలీమ్, ఖాజా, తిరుమలేశ్వర్‌రెడ్డి, అజాం, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నగర పంచాయతీ చైర్మన్, తహసీల్దార్, కౌన్సిలర్లు

డోన్ : మండల పరిధిలోని ఓబులాపురం, దేవరబండ, మల్యాల గ్రామాలలో గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని పేదలు సమస్యను వివరిస్తే పరిశీలించి న్యాయం చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు సర్పంచ్‌లతో కలిసి ఎంపీడీఓ అందజేశారు. కార్యక్రమంలో దేవరబండ, ఓబులాపురం, మల్యాల సర్పంచ్‌లు మధుసూధన్‌రెడ్డి, గొల్ల రమణ, భాస్కర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు సునీల్, పంచాయతీ అధికారి మోహన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

- పట్టణ పరిధిలోని 5, 6వ వార్డుల్లో కౌన్సిలర్లు మౌళాబీ, ఫాతిమాబీల ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ధ్రువీకరణ పత్రాలను మున్సిపల్ టెక్నికల్ అధికారి అనిరుధ్‌తో కలిసి వారు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయాల కన్వీనర్ సయ్యద్ లడ్డు తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని బూరుగల, బోంచెర్వుపల్లి గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. డీటీ మారుతి, ఈఓఆర్డీ బాలకృష్ణుడు, బోంచెర్వుపల్లి సర్పంచ్ కొత్తూరు రాముడు, బూరుగల వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తులసిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణ, కంబగిరి రాముడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి సేకరించిన భూముల పరిశీలన

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం సోమయాజుపల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్‌కు వరకు చేపట్టే జాతీయ రహదారి నిర్మాణానికి సేకరించిన భూమి గురువారం ఆర్డీఓ వెంకట రెడ్డి పరిశీలించారు. ఆర్ ఎస్ రంగాపురం, ఆర్ కొత్తపల్లె గ్రామాల్లో సంబంధిత భూమిలో ఉన్న ఇళ్లు, షాపులను తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, సర్వేయర్ జ్యోస్నతో కలిసి పరిశీలించిన ఆర్డీఓ వివరాలు సేకరించారు. ఆ భూములకు సంబంధించిన వివిధ అంశాలపై తహసీల్దార్‌తో ఆర్డీఓ చర్చించారు.



ఆర్ కొత్తపల్లె గ్రామంలో రహదారి ప్రక్కన్న భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

బనగానపల్లె రూరల్: విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న బీసీ బాలుర వసతి గృహం, జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాల వసతి గృహం, ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాలను గురువారం డాక్టర్ శివశంకరుడు సందర్శించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ధ్యానం, యోగా పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు, వసతి గృహాల వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు

విద్యార్థులకు తప్పని అవస్థలు

డోన్ టౌన్: ఆర్టీసీ బస్సుల కోసం విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. గురువారం బస్సును బాలురులు కిటికీల ఎక్కుతుండగా బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ సానుకూలంగా స్పందించారు. మోడల్ స్కూల్‌కు శుక్రవారం నుంచి మూడు బస్సులను ఏర్పాటు చేసి ఏడు రూట్లకు బస్సులు తిప్పుతామని హామీ ఇచ్చారు. పీఆర్ పల్లి, చెర్లకొత్తూరు రూట్లకు బస్ పాస్‌లు సిద్ధం కాలేదని, రెండు బస్సులు ఉన్నప్పటికీ విద్యార్థులు ఆత్రుతగా ఒక్క బస్సే అని ఎక్కేస్తున్నారన్నారు.

జంతువుల వ్యాధులపై అప్రమత్తత అవసరం



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న నాగరాజు



యాంటి రేబిస్ టీకా వేస్తున్న మారుతి సకారామ్

డోన్ : జంతువుల నుండి మనుషులకు, మనుషుల నుండి జంతువులకు సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ నాగరాజు తెలిపారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణకు గురువారం ఉచిత టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఏడీ నాగరాజు మాట్లాడుతూ వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైనది పిచ్చికుక్క కాటు వల్ల సంభవించే రేబిస్ అన్నారు.

బనగానపల్లెరూరల్: కుక్కల పెంపకందారులు యాంటి రేబిస్ టీకాలను తప్పనిసరిగా వేయించాలని బనగానపల్లె పశుసంవర్ధకశాఖ ఏడీఏ డాక్టర్ మారుతి సకారామ్ అన్నారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటి రేబిస్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఏడీఏ డాక్టర్ మారుతి సకారామ్ మాట్లాడుతూ జంతువుల ద్వారా అంత్రాక్స్, రేబిస్, బ్రూసెల్లోసిస్ లాంటి ప్రాణాంతక వ్యాధులు మనుషులకు సోకే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రామ్ కుమార్‌రెడ్డి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఖురేష్, డాక్టర్ తస్లిమా తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: జూనోటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొలిమిగుండ్లలోని పశువైద్యశాలలో డాక్టర్ పద్మావతి పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. కొలిమిగుండ్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి 24 మంది యజమానులు పెంపుడు కుక్కలను తీసుకురావడంతో వ్యాక్సిన్ వేశామని ఆమె తెలిపారు.

బేతంచెర్ల : జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమిస్తాయని, జాగ్రత్తగా ఉండాలని వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక పశువైద్యశాల్లో ప్రపంచజునోసిస్ దినోత్సవం సందర్భంగా పశు సంవర్ధశాఖ ఆధ్వర్యంలో 120 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను ఉచితంగా వేశారు. కార్యక్రమంలో పశువైద్యులు అజయ్ కుమార్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



మహిళ కుటుంబాఇకి వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని, మౌలిక వసతుల కల్పనకు రూ. కోట్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లింగంబోడు, గడ్డమేకులపల్లె, రామవరం గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే కాటసాని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి తదితర నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పాలనను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సచివాలయం, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్‌లను నెలకొల్పి ప్రజల వద్దకే పాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. సీసీ రోడ్లు నిర్మించాలని, శ్మశానవాటికిలో గ్రావెల్ తోలించాలని, కల్వర్టులు ఏర్పాటు చేయించాలని, అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించాలని లింగబోడు గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా గ్రావెల్ రోడ్డు, శుద్ధజల కేంద్రాన్ని నిర్మించాలని గడ్డమేకులపల్లె గ్రామస్తులు కోరారు. రామవరంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, శివాలయం వరకు సీసీ రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రం, పొలాలకు రస్తాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా స్పందించిన ఎమ్మెల్యే పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మూరబోయిన మనోహర్, నాయకులు సుబ్బారెడ్డి, కిట్టారెడ్డి, వెంకట సుబ్బన్న, మనోహర్, చిన్న తిమ్మయ్య, గొర్ల పుల్లయ్య, సుబ్బరాయుడు, రామ్మోహన్, గురుశివ, ఆంజనేయులు, ప్రసాద్, చలపతి, రామక్రిష్ణ, స్వామిదాసు, నాగరాజు, పాలదస్తగిరి, ప్రసాద్ రమణయ్య, దేవరకొండ గంగన్న, కోనేటి వెంకటేశ్వర్లు, కోనేటి తిరుపతయ్య, ఈడిగ బాలరాజు, కుళ్లాయప్ప, గోపాలగారి సురేష్, కోనేటి సుధాకర్, వెంకటేష్, దేవరకొండ పుల్లన్న పాల్గొన్నారు.

చింతలకుంట అభివృద్ధికి ప్రతిపాదనలు

డోన్ టౌన్ : మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలోని చింతలకుంట అభివృద్ధికి నిధులు మంజూరుకు ప్రభుత్వానికి తగిన ప్రతి పాదనలు పంపుతామని తహసీల్దార్ విద్యా సాగర్ తెలిపారు. గురువారం జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ గ్రామస్తుల విన్నపం మేరకు చింతలకుంటను పరిశీలించారు. ఈ కుంటను అభివృద్ధి చేస్తే కొత్తపల్లె, ఉంగరానిగుండ్ల, సీసీంగుంతల, ఓబులాపురం గ్రామాల్లోని భూగర్భ జలాలు పెరుగుతాయని గ్రామస్తులు తహసీల్దార్‌కు వివరించారు. సాగు, తాగు నీటి సమస్యలు తలెత్తవని సర్పంచ్ శాంతమ్మ, ఎంపీటీసీ ఓబులేసు తహసీల్దార్ దృష్టికి తీసుకొవచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నమద్ది, పెద్ద నరసింహులు, మెట్ట రంగస్వామి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు ప్రాంతాల పరిశీలన

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల ప్రధాన రహదారిపై డివైడర్, సెంట్రల్ లైటింగ్,ఆర్టీసీ బస్టాండ్ ప్లాట్‌ఫారంలో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయనుండటంతో గురువారం ఆ ప్రాంతాలను జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో విశాలమైన సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్,బస్టాండ్‌లో రోడ్డు ఏర్పాటు చేయాలని కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ రామ్‌కో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించి సీఎస్‌ఆర్ నిధులు మంజూరు చేశారు. ఏపీజీపీ బ్యాంక్ నుంచి తేరు మిద్దె సమీపం వరకు డివైడర్, బటర్‌ఫ్లై లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడెక్కడ ఎలా చేయాలనే వాటిపై జెడ్పీ చైర్మన్ రామ్‌కో ప్రతినిదులతో చర్చించారు.

ఈరోజు

జగనన్న సురక్ష కార్యక్రమం

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానలపల్లె సచివాలయం –3, తిమ్మాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు.అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంకా అందని వారు దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి తగిన న్యాయం చేస్తామన్నారు. అదేవిధంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇంటి స్థలాలకు సంబంధించి పొజిషియన్ సర్టిఫికెట్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ల అనుసంధానం తదితర 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందించునున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కోవెలకుంట్ల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో వాసగిరి రత్నమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు వాసగిరి సాయికృష్ణమూర్తి తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి నంద్యాల శాంతిరాం ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని పేర్కొన్నారు.

నందవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

బనగానపల్లె : మండలంలో నందవరం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ శివరామయ్య గురువారం తెలిపారు. మధ్యాహ్నం నుంచి జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్ : స్థానిక ఆర్టీసీ డిపోల శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలోని గ్రామాల ప్రజలు బస్సు సర్వీసులకు సంబంధించిన సమస్యలు, సలహాలను 9959225795 నంబర్‌కు తెలుపాలని డీఎం సూచించారు.

కరెంటు సౌకర్యం కల్పించాలి

డోన్ టౌన్ : మండలంలోని దొరపల్లె గ్రామ సమీపంలోని చదల రామయ్య కాలనీలోని గృహాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు విద్యుత్ శాఖ డీఈ ప్రసాద్‌రెడి, ఏఈ నాగేశ్వరరెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం కాలనీ పర్యటనకు వచ్చిన అధికారులను వారు కలిసి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, విజయుడు, పక్కీరప్ప, ఎర్రన్న, ఇంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మున్సిపల్ పరిపాలన భవనంలో పూజలు

డోన్ : రూ.6కోట్లతో నిర్మించిన డోన్ పురపాలక నూతన భవనాన్ని ఇటీవల మంత్రులు ఆదిమూలపు సురేష్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ గురువారం ప్రత్యేక పూజల అనంతరం చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకట్రామిరెడ్డితో పాటు అధికారులు, సిబ్బంది కొత్త భవనంలో విధులు ప్రారంభించారు. కొత్త ఛాంబర్‌లో చైర్మన్ ఆశీనులయ్యారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాదులు నాగభూషణంరెడ్డి, విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్ఈ రాజవర్ధన్, పారిశ్రామికవేత్త క్వాలిటీ అబ్దుల్లా, ఇన్నర్వీల్ వ్యవస్థాపకురాలు రాజా సుజాత, క్లబ్ అధ్యక్షురాలు శాలిని, పాలకవర్గ సభ్యులు, అధికారులు, చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.



చైర్మన్ సత్కరిస్తున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

తీరిన రహదారుల సమస్య!

- సొంత నిధులతో గ్రావెల్ రోడ్లు వేయించిన సర్పంచ్ కాటసాని రమాకాంత్‌రెడ్డి



పెద్దకొట్టాల నుంచి పొలాలకు గ్రావెల్ రోడ్డు వేసిన దృశ్యం,



కాలువ పక్కన పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డు

అవుకు: మండలలోని గుండ్లశింగవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాఘవరాజపురం(పెద్ద కొట్టాల)లో ఏళ్లతరబడి నెలకొన్న రహదారి సమస్యలు ఎట్టకేలకు తీరాయి. పొలాలు, శ్మశానవాటికి వెళ్లేందుకు రహదారులు సరిగాలేక గ్రామస్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కున్నారు. గ్రామస్తులు సమస్యను సర్పంచ్ కాటసాని రమాకాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించారు. సొంత నిధులు వెచ్చించి చేపట్టిన గ్రావెల్ రోడ్ల నిర్మాణం పూర్తయ్యాయి. కోనాపురం నుంచి ఎస్సార్బీసీ కాలువ వరకు 1.5 కిలోమీటర్ల రోడ్డు, వాటర్ ట్యాంక్ నుంచి 1కిలోమీటర్ పొలాలకు వెళ్లే రహదారి, ఊరు ప్రారంభం నుంచి శ్మశానవాటిక వరకు 3 కిలోమీటర్లు గ్రావెల్ రోడ్లు వేయించారు. ఏళ్లతరబడి నెలకొన్న రహదారి ఇబ్బందులు తొలగడంతో గ్రామస్తులు సర్పంచ్ కాటసాని రమాకాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.